క్లుప్తంగా

యనమలకుదురులో మజ్జిగ పంపిణీ



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో సోమవారం వైఎస్సార్ సీపీ నాయకుడు అన్నవరపు కిరణ్ వర్ధంతి సందర్భంగా వైఎస్సార్ సీపీ నేతలు 400 మందికి మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో తాడిగడప మున్సిపాలిటీ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వేమూరి బాలకృష్ణ, పార్టీ సీనియర్ నేతలు పిడికిటి రామకోటేశ్వరరావు, గుమ్మడి విజయ్‌కుమార్, నేతలు మరీదు శ్రీనివాసరావు, షడ్రక్, అయోధ్య సత్యనారాయణ, గుమ్మడి అన్వేష్, నామతోటి శ్రీను, షడ్రక్, అన్నవరపు కిషోర్ పాల్గొన్నారు.

అనధికార భవన నిర్మాణం కూల్చివేత



పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని యనమలకుదురులో అనధికార నిర్మాణాన్ని టౌన్ ప్లానింగ్ అధికారులు సోమవారం కూల్చివేశారు. యనమలకుదురు శివపార్వతీ నగర్‌లో అనధికారికంగా నిర్మిస్తున్న అంతస్తు శ్లాబ్‌ను కూల్చివేశారు. తాడిగడప మున్సిపాలిటీలో అనధికార నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ భవానీప్రసాద్ హెచ్చరించారు.

గాయపడిన వ్యక్తి మృతి

పెనమలూరు: కూలి పనులు చేస్తూ గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందటంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం పోరంకి బీజేఆర్ నగర్‌కు చెందిన బి.సుబ్బారావు(62) కూలి పనులు చేస్తాడు. ఈ నెల 11వ తేదీన పెనమలూరు డంపింగ్ యార్డు వద్ద షెడ్డు వేయటానికి సుబ్బారావు, మరి కొందరితో కలిసి వెళ్లాడు. రేకులు వేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు రేకులు పగిలి పై నుంచి కిందకు పడిపోగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. సుబ్బారావును విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. చికిత్స పొందుతున్న సుబ్బారావు ఆదివారం రాత్రి ఆస్పత్రిలో మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు వాసు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కోడి పందేలు నిర్వహిస్తున్న ఇద్దరు అరెస్టు

పెనమలూరు: యనమలకుదురులో కోడి పందేలు నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఎస్ఐ ఫిరోజ్ తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు హోసన్న మందిరం వెనుక ఖాళీ స్థలంలో కోడి పందేలు ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేశారు. కోడి పందేలు ఆడుతున్న ఇద్దరు వ్యక్తులు పట్టుబడగా మిగతా వారు పారిపోయారు. ఘటనా స్థలంలో రెండు పుంజులు, 10 కోడి కత్తులు, ఆరు బైక్‌లు, రూ.2300 సొమ్ము స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

వేధిస్తున్న భర్తపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భార్యను వేధిస్తున్న భర్తపై కొత్తపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. లంబాడీపేట సాయిరాం సెంటర్‌కు చెందిన షేక్ యాస్మిన్, మన్సూర్ భార్యాభర్తలు. వీరికి ప్రేమ వివాహం కాగా ఓ కుమారుడు సంతానం. ఆటో నడుపుకుని జీవనం సాగించే మన్సూర్ కొంత కాలంగా మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని భార్యను వేధింపులకు గురి చేయసాగాడు. అంతేకాకుండా యాస్మిన్ బంగారు నగలను అమ్ముకున్నాడు. భార్యను పుట్టింటికి వెళ్లి రూ.30 వేలు తీసుకురావాలని వేధింపులకు గురి చేస్తుండటంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సరస్వతి పుష్కరాలకు ఆర్టీసీ సర్వీస్

మచిలీపట్నంటౌన్: సరస్వతి పుష్కరాలను పురస్కరించుకుని ప్రసిద్ధ కాళేశ్వరం పుణ్యక్షేత్రంకు మచిలీపట్నం ఆర్టీసీ డిపో నుంచి సూపర్ లగ్జరీ బస్సు సర్వీస్‌ను ఏర్పాటు చేశామని డిపో మేనేజర్ టి.పెద్దిరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21వ తేదీ బుధవారం రాత్రి 8 గంటలకు ఈ బస్ సర్వీసు మచిలీపట్నంలో బయలుదేరి ఉదయం కాళేశ్వరం చేరుతుందన్నారు. 23వ తేదీ ఉదయం మచిలీపట్నంకు చేరుతుందన్నారు. ఒక్కరికి టిక్కెట్ ధర రూ. 2 వేలుగా నిర్ణయించామన్నారు. ఎక్కువమంది ప్రయాణికులు బృందంగా టికెట్లు కొనుగోలు చేస్తే వారు కోరిన చోట నుంచి బస్సు బయలుదేరుతుందన్నారు. టిక్కెట్ అడ్వాన్స్ రిజర్వేషన్ కోసం 8808807789, 9963284363, 7382800995 సెల్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అభివృద్ధికి నోచుకోని కాజ్‌వేలు

- ఇబ్బందులు పడుతున్న పలు గ్రామాల ప్రజలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

గన్నవరం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న కాజ్‌వేలు శిథిలావస్థకు చేరాయి. దశాబ్దాల క్రితం నిర్మించిన వీటిని ఆ తర్వాత కాలంలో ఆధునీకరించకపోవడంతో అధ్వాన స్థితికి చేరాయి. రహదారులపై నిర్మించిన కాజ్‌వేలను కొత్తగా నిర్మించాలని రైతాంగం కోరుతున్నారు. అయితే వీరి మొర ఆలకించేవారే లేరు.

రాకపోకలకు అంతరాయం

కేసరపల్లి నుంచి సావరగూడెం వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్గంలో చీమలవాగు దాటిన తర్వాత కాజ్‌వే ఉంది. వర్షాలు కురిసిన సమయంలో ఈ కాజ్‌వే పైకి నీరు వచ్చి చేరుతుండటంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. అదేవిధంగా ముస్తాబాద, సూరంపల్లి రోడ్డు మార్గంలో లంబాడ బాట వాగుపై కాజ్‌వే ఉంది. ముస్తాబాద పెద చెరువు కళింగ పొంగినప్పుడు నీరు వాగులోకి ప్రవహిస్తుంది. వరదలు వచ్చినప్పుడు కాజ్‌వే పైన నీరు పొంగి ప్రవహిస్తుంది.

దీంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. అలాగే సూరంపల్లి, రామచంద్రాపురం గ్రామాల మధ్య పోలవరం అండర్ పాసేజ్ ద్వారా నీరు వెంచర్ల వద్ద కాజ్‌వే దాటి ముస్తాబాద పేడ చెరువులోకి వెళుతుంది. వానలు అధికంగా కురిస్తే ఇక్కడ రహదారిపై ఉన్న కాజ్‌వేపై నీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది.



సావరగూడెం ఆర్‌అండ్‌బీ రహదారిపై ఉన్న కాజ్‌వే



ముస్తాబాద లంబాడ బాటపై ఉన్న కాజ్‌వే



ముస్తాబాద వద్ద చెత్త, వ్యర్థాలతో పూడుకుపోయిన లంబాడబాట వాగు

కాజ్‌వేలపై దృష్టి పెట్టని ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ శాఖలు

ఈ కాజ్‌వేలపై ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ శాఖలు సంయుక్తంగా సర్వే నిర్వహించి వీటిని ఎత్తు పెంచి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా నిర్మించాలని రైతాంగం కోరుతున్నారు. పలుసార్లు ఈ రహదారి మార్గాల్లో ఆర్‌అండ్‌బీ రోడ్లు నిర్మించినా, కాజ్‌వేలపై దృష్టి పెట్టలేదని రైతాంగం ఆరోపిస్తున్నారు. ఇరిగేషన్ శాఖను సమన్వయం చేసుకుని కాజ్‌వేలను నిర్మించాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ఆధునీకరించాలి

సావరగూడెం వద్ద ఉన్న కాజ్‌వేకు కొత్తగూడెం వద్ద నుంచి చీమలవాగు నీరు ప్రవహిస్తూ చిక్కవరం, బీబీ గూడెం, పురుషోత్తపట్నం దాటి ఇక్కడకు వస్తుంది. ఈ కాజ్‌వే దాటి గూడవల్లి వద్ద బుడమేరులోకి చేరుతుంది. ముస్తాబాద లంబాడ బాట వాగుకు వచ్చే నీరు పక్కనే ఉన్న పెద చెరువు దాటి పేడ చెరువుకు చేరుతుంది. రామచంద్రాపురం వద్ద కాజ్‌వే పైకి వచ్చే నీరు మాదలవారిగూడెం నుంచి వచ్చి పోలవరం అండర్ పాసేజ్ దాటి ఈ వాగులోకి ప్రవహిస్తుంది. ఈ కాజ్‌వేలను ఆధునీకరించాలని రైతాంగం కోరుతున్నారు.

కొత్తవి నిర్మించాలి



ఎన్నో ఏళ్ల క్రితం కాజ్‌వేలు నిర్మించారు. అవి శిథిలావస్థకు చేరాయి. వాటిని కొత్తగా నిర్మించాలి. ఆధునికంగా నిర్మించి రైతులకు మేలు చేయాలి. ప్రతి ఏడాది ఇవి నీట మునిగి రాకపోకలు నిలిపివేస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకుని కాజ్‌వేలు కొత్తగా నిర్మించాలి.

– బెజవాడ తాతబ్బాయి, సీపీఎం నాయకుడు

కాజ్‌వేల ఎత్తు పెంచాలి



కాజ్‌వేల ఆధునీకరణ రైతులకు మేలు చేస్తుంది. ఇప్పటి వరకు కాజ్‌వేలు ఎంతగానో ఉపయోగపడ్డాయి. అయితే అవి దశాబ్దాల క్రితం నిర్మించినవి. ముస్తాబాద లంబాడ బాట వాగుపై గతంలో తండ్రి కూతురు కొట్టుకుపోయారు. వీటిని ఎత్తు పెంచి నిర్మించాలి. అప్పుడే రాకపోకలకు ఇబ్బందులు ఉండవు.

– మిరప నాగేశ్వరరావు, వ్య.కా.స నాయకుడు

అలరించిన కళాజాత ప్రదర్శనలు

కంకిపాడు: కళాజాతా బృంద ప్రదర్శన ఆద్యంతం అలరించింది. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ వారి సహకారంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పర్యవేక్షణలో, జిల్లా కలెక్టర్ ఆదేశాలతో హెచ్ఐవీ నియంత్రణ, నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై కళాజాత బృందం కంకిపాడు ప్రధాన సెంటరులో సోమవారం కళారూపాలను ప్రదర్శించారు. ఐసీటీసీ, ఏఆర్‌టీ సెంటర్లు, పీపీటీసీ కేంద్రాలు, మొబైల్ కేంద్రాల ద్వారా అందించే వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గుడివాడకు చెందిన యడవల్లి వీరయ్య కల్చరల్ సొసైటీ కళాకారులు వీధి నాటిక రూపంలో ఇచ్చిన ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో కంకిపాడు సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దుర్గాదేవి, ఐసీటీసీ కౌన్సిలర్ రాజారావు, గైడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, ప్రాజెక్టు మేనేజరు సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఉప సర్పంచ్ ఎన్నిక

కంకిపాడు: ఉప్పలూరు ఉప సర్పంచ్ ఎన్నిక ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. షెడ్యూల్ ప్రకారం...సోమవారం ఉప సర్పంచ్ ఎన్నికను స్థానిక గ్రామ పంచాయతీలో నిర్వహించారు. పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవంగా కలపాల కనకారావును ఎన్నుకున్నారు. ఈ మేరకు ఎన్నికల అధికారి బీఎస్ఆర్ కోటేశ్వరరావు నుంచి కనకారావు నియామక పత్రాన్ని అందుకున్నారు. కార్యక్రమాన్ని సర్పంచ్ లాం సోనియా, ఈఓఆర్‌డీ కిరణ్మయి, ఈఓ బి.వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు. నూతన ఉప సర్పంచ్ కనకారావును టీడీపీ గ్రామ అధ్యక్షుడు చలసాని రాధాకృష్ణమూర్తి, పాలకవర్గ ప్రతినిధులు అభినందించారు.

సుందరయ్య ఆశయ సాధనకు కృషిచేయాలి

పెనమలూరు: కమ్యూనిస్టు యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి షేక్ కాశిం అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా యనమలకుదురు గ్రామంలో సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాశిం మాట్లాడుతూ పీడిత ప్రజల హక్కుల కోసం పుచ్చలపల్లి సుందరయ్య అనేక ఉద్యమాలు చేశారన్నారు. సుందరయ్య కోరుకున్న విధంగా కుల, మతాల కతీతంగా బడుగు బలహీన వర్గాల వారు ఐక్యంగా తమ హక్కుల సాధనకు ఉద్యమించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు షేక్ మస్తాన్‌వలి, వాటపల్లి శ్రీరాములు, షేక్ బాబు, ఎం.సత్యం, షేక్.వలి, షేక్ హుస్సేన్‌బి, షేక్ కరీముల్లా, లక్ష్మణరావు పాల్గొన్నారు.

పోరంకిలో...

పోరంకి గ్రామంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సీనియర్ కమ్యూనిస్టు నేత నారిన వెంకట్రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పుచ్చలపల్లి సుందరయ్య చేసిన ఉద్యమాలు మరువలేనివని నేతలు కొనియాడారు. కార్యక్రమంలో నేతలు ఉప్పాడ త్రిమూర్తి, కాశిం, ఉయ్యూరు వెంకట్రావు, పోతులూరి శ్రీనివాసరావు, అమరయ్యశాస్త్రి, పి.లక్ష్మీనారాయణ, కాట్రగడ్డ నాగమణి పాల్గొన్నారు.



పోరంకిలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి నిర్వహిస్తున్న సీపీఎం నేతలు

సుందరయ్య జీవితం ఆదర్శనీయం

గన్నవరం: స్థానిక సీపీఎం కార్యాలయం వద్ద సోమవారం కమ్యూనిస్టు ఉద్యమ నేత పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పార్టీ జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సుందరయ్య విజ్ఞాన కేంద్రం, రెడ్ వలంటీర్లు ఏర్పాటు చేసిన చలివేంద్రంలో ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమమే ఊపిరిగా, ఆశయాలే గీటురాయిగా జీవించిన సుందరయ్య కమ్యూనిస్టు వైతాళికుడిగా అభివర్ణించారు. పార్టీ నాయకులు మల్లంపల్లి ఆంజనేయులు, సూరగాని సాంబశివరావు, మిరప నాగేశ్వరరావు, పఠాన్ సర్దార్, కళ్ళం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



తేలప్రోలులో సుందరయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

ఉంగుటూరు మండలంలో...

ఉంగుటూరు మండలంలోని తేలప్రోలు, ఎలుకపాడు, వెన్నూతల, ఆత్కూరు తదితర గ్రామాల్లో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య విగ్రహాలకు పార్టీ నేతలు టీవీ లక్ష్మణస్వామి, ఆజ్మీర్ వెంకటేశ్వరరావు, మాగంటి సాంబశివరావు, టీవీ రామ్మోహన్‌రావు, సుబ్బారెడ్డి, పిల్లి రాజారావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాలు

గన్నవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా జరుగుతోంది. ఈ శిబిరంలో సోమవారం విద్యార్థులకు బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. తొలుత విద్యార్థులకు పుస్తక పఠనం, స్పోకెన్ ఇంగ్లిష్, చిత్రలేఖనం పోటీల్లో శిక్షణ ఇచ్చారు. విద్యార్థుల్లో పఠనాభిలాషను పెంపొందించేందుకు, సృజనాత్మక శక్తిని ప్రోత్సహించేందుకు విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యుడు చిమట రామారావు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇన్‌చార్జ్ లైబ్రేరియన్ పీడీ లక్ష్మి, విశ్రాంత ఉద్యోగి ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

క్యారమ్స్, చెస్‌లో విద్యార్థులకు శిక్షణ

కంకిపాడు: వేసవి శిక్షణ శిబిరాలు ఉత్సాహంగా..ఉల్లాసంగా సాగుతున్నాయి. కంకిపాడు శాఖా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులు కథలు చెప్పటం, క్యారమ్స్, చెస్‌లో ప్రత్యేక శిక్షణ పొందారు. కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ, ఎస్.అప్పారావు, ఉపాధ్యాయుడు మల్లేశ్వరరావు పర్యవేక్షించారు. తెన్నేరు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులు కథలు చెప్పటం, భగవద్గీత శ్లోకాల పఠనం నిర్వహించారు. చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. శిబిరాన్ని గ్రంథాలయాధికారి ఎస్.సునీత పర్యవేక్షించారు.



గన్నవరంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

పెద్దలను గౌరవించటం అందరి బాధ్యత

గన్నవరంరూరల్: పెద్దలను గౌరవించటం విద్యార్థులకు చిన్న నాటి నుంచే నేర్పాలని ముస్తాబాద శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కె.జ్యోతి కుమారి సూచించారు. స్థానిక గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపులో భాగంగా సోమవారం విద్యార్థులకు పెద్దలను, గురువులను, ఉపాధ్యాయులను గౌరవించాల్సిన విషయంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో కథలు చెప్పించారు. డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. చెస్, లూడో, స్నేక్ ల్యాడర్ వంటి ఆటలు ఆడించారు. పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



కంకిపాడు గ్రంథాలయంలో చెస్, క్యారమ్స్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు



ముస్తాబాదలో డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నున్న-అంబాపురం రోడ్డుకు ఆక్రమణల బెడద

విజయవాడరూరల్: విజయవాడ-విస్సన్నపేట ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి విజయవాడ-నూజివీడు ఆర్‌అండ్‌బీ రోడ్డుకు అనుసంధానం చేసే నున్న-అంబాపురం రోడ్డు ఆక్రమణల్లో చిక్కుకుంది. 1985వ సంవత్సరానికి ముందు ప్రభుత్వ లెక్కల్లో గన్నవరం సమితి రహదారిగా ఉన్న ఈ రహదారిని నిర్వహణ నిమిత్తం ఆర్‌అండ్‌బీ శాఖకు స్వాధీనం చేశారు. దాదాపు 40 సంవత్సరాల సుదీర్ఘ కాలంలో రాష్ట్ర విభజన జరిగిందే తప్ప ఈ రోడ్డు మాత్రం అభివృద్ధికి నోచుకోలేదు. పాముల కాల్వ నుంచి నున్న గ్రామం వరకు సుమారు 9 కిలోమీటర్ల దూరం ఉంది. ఈ మార్గంలో మొదటి గ్రామం అయిన అంబాపురం గ్రామం విజయవాడ నగరానికి కూతవేటు దూరంలో ఉండటంతో కబ్జాదారులు రోడ్డుకు ఇరువైపులా ఆక్రమించుకుని అద్దెలకు ఇచ్చుకుంటున్నారు. ఈ ఆక్రమణలపై ఆర్‌అండ్‌బీ వారు నోరు మెదిపిన పాపాన పోవడం లేదు. ఆక్రమణలు తొలగించాలని గ్రామ పంచాయతీ తీర్మానం చేసి పంపితే ఆర్‌అండ్‌బీ అధికారులు యాక్షన్ తీసుకుంటామంటారే తప్ప ఎటువంటి యాక్షన్ తీసుకున్న దాఖలాలు లేవు. విజయవాడ నగరంలోని చేపల వ్యాపారులు పి.నైనవరం గ్రామంలో పెద్ద పెద్ద గోడౌన్లు నిర్మించారు. వారితో పాటు ఫ్లిప్‌కార్ట్ గోడౌన్లు నిర్మించి స్టాకు నిల్వ చేసి అక్కడ నుంచి విజయవాడ నగరంలోకి ప్రతి రోజూ సరుకును పంపుతుంటారు. గోడౌన్లకు వచ్చే కంటైనర్లు, భారీ వాహనాలు అధిక సంఖ్యలో ఇతర రాష్ట్రాల నుంచి రాకపోకలు సాగించడంతో ట్రాఫిక్ సమస్య పెరిగి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. స్కూల్, కాలేజీ బస్సులు వచ్చే సమయంలో గ్రామస్తుల బాధలు వర్ణనాతీతం. కంటైనర్ లాంటిది ఎదురుగా వస్తే కనీసం ద్విచక్ర వాహనం వెళ్లటానికి కూడా అవకాశం ఉండదు. దానికి తగ్గట్లు గాంధీబొమ్మ సెంటర్లో రోజుకో వ్యాపారం రోడ్డు పైకి వచ్చి వెలుస్తోంది. గ్రామ పంచాయతీ అవేమీ పట్టనట్లు వ్యవహరిస్తోందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదే గ్రామంలో ట్రేడింగ్ రైస్ మిల్ ఉండటంతో అనేక గ్రామాల నుంచి ధాన్యం లారీల రాకపోకలతో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రం అవుతోంది. అప్పారావుపేట, వెంకటాపురం, పాతపాడు గ్రామాల్లోను రోడ్డు వెంబడి ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. నున్న చెరువు సెంటర్లో రోడ్డుకు ఆనుకుని కూరగాయల దుకాణాలు, హోటళ్లు, వెల్డింగ్ షాపు, బార్బర్ షాపులను పెట్టి వ్యాపారాలు చేస్తున్నా ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. నున్న గ్రామం నుంచి అంబాపురం పాముల కాల్వ వరకు ఆక్రమణలు తొలగించి రోడ్డును విస్తరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



పి.నైనవరం గ్రామంలో గోడౌన్ల వద్ద వెయిటింగ్‌లో లారీలు


ఆక్రమణలు తొలగించి వెడల్పు చేయాలి



నున్న-అంబాపురం ఆర్‌అండ్‌బీ రహదారిలో ఆక్రమణలు తొలగించి, రోడ్డును వెడల్పు చేయాల్సివుంది. విజయవాడకు ఆనుకుని వుండటంతో గోడౌన్లు పెరిగి భారీ వాహనాల రాకపోకలు అధికమయ్యాయి. దీనివలన ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది.

–దావు కోటేశ్వరరావు, మాజీ సర్పంచి, పి.నైనవరం

ట్రాఫిక్ సమస్యతో అవస్థలు



అంబాపురం గ్రామం నుంచి నున్న వైపు వెళ్లే రోడ్డులో ట్రాఫిక్ సమస్య అధికంగా వుంది. ఒక రోజు కాదు, రెండు రోజులు కాదు ప్రతి రోజు ట్రాఫిక్ సమస్యతో గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ శాఖ ఈ రోడ్డుపై ప్రత్యేక శ్రద్ధ చూపి వెడల్పు చేయాలి.

–కె.సర్వేశ్వరరావు, అంబాపురం

ఆక్రమణను అడ్డుకున్న అధికారులు

సాక్షి స్పందన

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు పీఎస్ఆర్ కాలనీలో ఏలూరు కాలువ కట్ట స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం సాగిస్తున్నారని ఈనెల 17న సాక్షిలో 'దర్జాగా ఇరిగేషన్ స్థలం ఆక్రమణ' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ ప్రాంతంలోని కాలువ కట్టపై సుమారు 3 సెంట్ల స్థలాన్ని గ్రామానికి చెందిన టీడీపీ నాయకుని అండతో ఆక్రమించి పునాదులు తీసి పిల్లర్లు నిర్మించారు. లక్షలు విలువ జేసే స్థలంలో యథేచ్ఛగా నిర్మాణం చేపట్టిన విషయాన్ని కథనం ద్వారా 'సాక్షి' అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. దీంతో సంబంధిత ఇరిగేషన్ శాఖ అధికారులు స్పందించి కాలువలోకి వేసిన పిల్లర్లను ధ్వంసం చేసి నిర్మాణ పనులు అడ్డుకున్నారు. ప్రభుత్వ స్థలం ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు.



నిర్మాణ పనులు అడ్డుకుని కాలువలోకి వేసిన పిల్లర్లను ధ్వంసం చేసిన అధికారులు

దరఖాస్తులకు సమయం పొడిగించాలి

మచిలీపట్నంటౌన్: సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు కాల వ్యవధి జూన్ నెల 25వ తేదీ వరకు పొడిగించాలని ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి ఎండీ సద్రుద్దీన్ ఖురేషి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తగిన ప్రచారం లేకపోవటంతో చాలా మంది మైనార్టీ నిరుద్యోగులు దరఖాస్తు చేసుకునేందుకు ఆలస్యమైందని చెప్పారు. దీంతో సగానికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేయలేక పోయారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గడువు పొడిగించాలని కోరారు. నగర, మున్సిపల్, మండల స్థాయిలో అధికారులు, ఎంపీడీఓలు గ్రామ సచివాలయాల ద్వారా ప్రచారం చేయించాలని కోరారు.

నున్నలో శాంతి కల్యాణోత్సవం

నున్న(విజయవాడరూరల్): గ్రామంలో శ్రీరుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి వార్ల దివ్య శాంతి కల్యాణోత్సవం సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవోపేతంగా నిర్వహించారు. అశేష భక్త జన సందోహం సమక్షంలో దేవదాయ, ధర్మదాయ శాఖ కార్యనిర్వహణాధికారి ఎస్.హేమలతాదేవి పర్యవేక్షణలో కల్యాణోత్సవం జరిగింది. సుమారు 600 సంవత్సరాల క్రితం నూజివీడు జమీందారు ప్రతిష్ఠించిన శ్రీ రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వార్ల దేవస్థానంలో ఐదు రోజులపాటు పంచాహ్నిక దీక్షతో వైఖానస ఆగమాన్ని అనుసరించి నిర్వహించిన అష్టబంధన సంప్రోక్షణ కుంభాభిషేక కార్యక్రమాలు సోమవారంతో ముగిశాయి. తొలుత స్వామి వార్లకు విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కుంభారాధన, ప్రధాన హోమాలు, మహా పూర్ణాహుతి, కళావాహన, అర్చన, బ్రహ్మఘోష, నీరాజనం నిర్వహించారు. ఐదు రోజుల పాటు పీటలపై కూర్చున్న దంపతులు భక్తి ప్రపత్తులతో మహా పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం దేవస్థానం అర్చకుడు రొంపిచర్ల దత్తకుమార్ ఆధ్వర్యంలో స్వామి వార్లకు దివ్య శాంతి కల్యాణోత్సవం నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ముఖ్య ప్రసంగికులు సుదర్శనం సీతారామాచార్యులు భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో జ్యోతిష్య పండిట్ డాక్టర్ మామిళ్ళపల్లి ఫణికుమార్, రుత్వికులు రొంపిచర్ల లోకాభిరాము, పరుచూరి నరహరి, అగ్నిహోత్రం చక్రధరాచార్యులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అన్నసంతర్పణ చేశారు.



శ్రీ రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామికి శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు